# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం  తెలుగు దినపత్రిక

సంపుటి : 03  సంచిక : 99  శుక్రవారం 09-01-2026  పేజీలు : 4  వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైమ్ కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు
Contact No: 98497 07349


## మిత్రుని కుటుంబానికి అండగా నిలిచిన తోటి కానిస్టేబుల్స్.



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆంజనేయులు( కానిస్టేబుల్) కుటుంబానికి 2,43,000 ఆర్థిక సాయం అందించిన... జిల్లా పోలీసులు.

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి నాగర్ కర్నూల్ జిల్లా: - నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులు( పిసి 1092).గత నెల 19 తేదీన అర్ధరాత్రి నేషనల్ హైవే 167 పైన ఆదిరాల గేటు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణించాడు.అంజనేయులు కుటుంబానికి 2,43,000 ఆర్థిక సహాయాన్ని జిల్లా పోలీసులు తరపున అతని తల్లి పేరు మీద పోస్ట్ ఆఫీస్ లో ప్రతి మూడు నెలలకు ఒకసారి 5000 ఇంట్రెస్ట్ వచ్చే విధంగా ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఆంజనేయులు కుటుంబానికి అండగా నిలిచిన తోటి కానిస్టేబుల్స్ ను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అభినందించారు.ఆంజనేయులు( పిసి ) వాళ్ల అమ్మ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మీ రాక కోసం ఇంట్లో కుటుంబం వేచి చూస్తుందని వారిని గుర్తుంచుకొని ఎల్లప్పుడు వాహనాన్ని జాగ్రత్తగా నడపాలని.మీరు లేని లోటు మీ కుటుంబానికి ఎవరు తీర్చలేరని, జిల్లాలో పనిచేసే ప్రతి పోలీసు లో తన కొడుకుని చూసుకుంటానని తెలిపారు.

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రజలకు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ కీలక సందేశం



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా:- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈరోజు మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఐఏఎస్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి ఐపీఎస్ ప్రజలనుద్దేశించి విస్తృతంగా మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం ట్రాఫిక్ నిబంధనల విషయం మాత్రమే కాదని, అది ప్రతి కుటుంబం భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది సమాజానికి తీరని నష్టమని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించుకోవచ్చని వివరించారు. త్రిబుల్ రైడింగ్ చేయడం వల్ల ప్రమాదాల అవకాశాలు రెట్టింపు అవుతాయని, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) అనేది నేరంతో సమానమని హెచ్చరించారు.జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమేనని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవడం కన్నా ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించడమే నిజమైన విజయం అని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, తమ కుటుంబాల ఆనందాన్ని కాపాడుకోవాలని, అలాగే ఇతరుల ప్రాణ భద్రతకు కూడా బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ జానకి ప్రజలకు హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ జానకి ఐపిఎస్ తెలిపారు.అనంతరం రోడ్ సేఫ్టీ పోస్టర్లను విడుదల చేసి, ప్రతిజ్ఞ చేయించండం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో కృష్ణా, డివైఎఫ్ఓ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ శ్రీమతి బెక్కరి అనితా రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ఉద్దీన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి, విద్యార్థులు యువకులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.




## ప్రశంసలు అందుకున్న సైబర్ వారియర్



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్న సైబర్ వారియర్ కానిస్టేబుళ్లు ఉ అభినందించిన.జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: - సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ అవగాహన కార్యక్రమాలలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను మహబూబ్‌నగర్ జిల్లా సైబర్ వారియర్ పోలీస్ కానిస్టేబుళ్లకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐపీఎస్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు మరియు నగదు బహుమతులు అందజేయడం జరిగింది.రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న అనంతరం ఈరోజు సంబంధిత సైబర్ వారియర్ కానిస్టేబుళ్లు జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారికి అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో కూడా సైబర్ నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ప్రశంసలు అందుకున్న సైబర్ వారియర్ కానిస్టేబుళ్ల వివరాలు:ఎం.మధు గౌడ్, పిసిఉ2216, మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్. వికాస్ రెడ్డి, పిసిఉ118, మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్.శ్రీనివాసులు, పిసిఉ2230, దేవరకద్ర పోలీస్ స్టేషన్.ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల కృషికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం పట్ల జిల్లా పోలీసు శాఖ హర్షం వ్యక్తం చేసింది.

## అన్న ప్రసాద పంపిణీ




లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద పంపిణీ అభినందనీయం.. అన్నదానం మహాదానం ఎస్సై మాధవరెడ్డి..

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి కల్వకుర్తి: - ఆకలితో ఉన్నవారికి అన్న ప్రసాదం పంపిణీ చేయడం గొప్ప విషయం అని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జూలూరు రమేష్ బాబు కుమారుడు జూలూరు రోహిత్ జన్మదినం సందర్భంగా అన్నప్రసాద పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడు అగ్రస్థానంలో ఉంటుందన్నారు. బస్టాండుకు వచ్చి పోయే ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందని ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. 350 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు చిగుల్లపల్లి శ్రీదర్ మాట్లాడుతూ రాబోయే రోజులు మరిన్ని సామాజిక సేవలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి కల్మిచర్ల గోపాల్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బ కిషన్, మాజీ కోశాధికారి గోవిందు శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి దారముని గణేష్, మేకల శ్రీనివాస్, శివ జగదీశ్వర్, మాచిపెద్దిఅశోక్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు



క్రైమ్ కౌంటర్ న్యూస్ మిర్యాలగూడ టౌన్ జనవరి 8 కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారి, జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి గారి ఆదేశాల మేరకు కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ బొమ్మకు ఉరి వేసిన షేక్ అజారుద్దీన్ ఈరోజు మిర్యాలగూడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత గౌ.రాహుల్ గాంధీ మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు స్థానిక రాజీవ్ చౌరస్తాలో ఉరి వేయడం జరిగింది.ఈ సందర్భంగా అజహర్ మాట్లాడుతూ గౌ.ముఖ్యమంత్రి మరియు రాహుల్ గాంధీ మీద కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ సికిందర్ ,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సతీష్ నాయుడు,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదాటి అనిల్ ,పట్టణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాస్తి అమర్ చౌదరి ,యువజన కాంగ్రెస్ నాయకులు రహీముద్దీన్ పాషా , ఇమ్రాన్, బబ్బర్ సింగ్,కిషన్ నాయక్,సోనూ, కరీం తదితరులు పాల్గొన్నారు.

## 1039 మొబైల్ ఫోన్ల రికవరీ



మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న దొంగిలించబడిన 1039 మొబైల్ ఫోన్ల రికవరీక్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి రాచకొండ మల్కాజ్గిరి: - మల్కాజిగిరి పోలీసులచే రూ. 2 కోట్ల 8 లక్షల విలువైన ఫోన్లు స్వాధీనం.ఈ రోజుల్లో మొబైల్ పరికరాల వాడకం పెరగడం వల్ల మొబైల్ ఫోన్ల దొంగతనాలు/పోగొట్టుకోవడం పెరుగుతున్నాయి. తర్వాత ఈ ఫోన్‌లను వివిధ వ్యక్తులు రకరకాల మార్గాల ద్వారా పొంది ఉపయోగిస్తున్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ సి.జి.ఐ.ఆర్ అనేది ఇటువంటి మొబైల్ ఫోన్‌లను గుర్తించడానికి ఒక సౌకర్యం.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపిఎస్ ఆదేశాల మేరకు, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న/దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను రికవరీ చేయడానికి సిసిఎస్ ఎల్బీ నగర్ మరియు మల్కాజిగిరిలో ఐటి సెల్ సహాయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలు ఆరు నెలల వ్యవధిలో రూ. 2 కోట్ల 8 లక్షల విలువైన సుమారు 1039 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేశాయి.ఎల్బీ నగర్.. 739. మల్కాజిగిరి.. 300.మొత్తం.. 1039ఈ సంవత్సరం ఇప్పటివరకు, సుమారు 4733 మొబైల్ ఫోన్‌లు (పైన పేర్కొన్న రికవరీతో సహా) రికవరీ చేయబడ్డాయి.ఈరోజు అంటే, 08వ జనవరి, 2025న, మల్కాజిగిరి పోలీసులు మొబైల్ ఫోన్‌లను వాటి అసలైన యజమానులకు అందజేశారు మరియు వారితో మాట్లాడి, ఈ విషయంలో మల్కాజిగిరి పోలీసుల పనితీరుపై వారి అభిప్రాయాన్ని తీసుకున్నారు. మొబైల్ ఫోన్‌లలో నిల్వ ఉన్న విలువైన సమాచారాన్ని రక్షించుకోవాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. తమ మొబైల్ పరికరాలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా అందుకున్నందుకు అసలైన యజమానులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు మరియు ఈ విషయంలో మల్కాజిగిరి పోలీసుల పనిని ప్రశంసించారు. కె. గుణ శేఖర్, ఐపిఎస్, డిసిపి క్రైమ్స్, సిహెచ్. రామేశ్వర్, అదనపు డిసిపి క్రైమ్స్, కరుణ సాగర్ ఎసిపి క్రైమ్స్, సిసిఎస్ ప్రత్యేక బృందాలు మరియు ఐటి సెల్ అధికారులు ఈ విషయంలో కృషి చేశారు.ప్రతి సిసిఎస్‌లో ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సి, పిసిలతో పాటు సిఇఐఆర్ పోర్టల్ ఇన్‌ఛార్జ్‌లతో కూడిన ప్రత్యేక బృందాలు, సిహెచ్. రామేశ్వర్, అదనపు డిసిపి క్రైమ్స్, కరుణ సాగర్ ఎసిపి క్రైమ్స్ నోడల్ అధికారులుగా వ్యవహరించి ప్రత్యేక బృందాల పనిని పర్యవేక్షించారు.ప్రజలకు సూచనలు.దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను కొనడం మరియు అమ్మడం నేరం.అధీకృత బిల్లు లేకుండా మొబైల్ ఫోన్‌లను కొనవద్దు.మొబైల్ పరికరంలో వినియోగదారుడి వ్యక్తిగత డేటా ఉంటుంది. ప్రయాణాలు చేస్తున్నప్పుడు మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు మొబైల్ ఫోన్‌లను సరిగ్గా భద్రపరచండి.నేరస్థులు నేర కార్యకలాపాలు మరియు సైబర్ నేరాల కోసం దొంగతనం మొబైల్‌లను ఉపయోగించవచ్చు. బలమైన భద్రతా పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి మరియు ( టఱఅఉ ఎఎ ఎవఙఱఎవ ) సెట్టింగ్‌ను సక్రియం చేయండి.విలువైన సమాచారం కోల్పోకుండా ఉండటానికి ఎప్పటికప్పుడు బ్యాకప్ డివైజ్ డేటా.మొబైల్ పోయినా లేదా దొంగిలించబడినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి.




## జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు...



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి కల్వకుర్తి: - గురువారం కల్వకుర్తి సిబిఎం కాలేజీలోని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్టూడెంట్స్ కి జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు 2026 ప్రోగ్రాములు భాగంగా స్టూడెంట్స్ అందరికీ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో భాగంగా ఎం జె పి రెసిడెన్షియల్ కాలేజ్ ప్రిన్సిపల్ యామిని , ఎంవిఐ అశోక్. కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి మరియు పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, 900 మంది స్టూడెంట్స్ పాల్గొనడం జరిగింది.



## సినీ సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్ తో బచ్చు పురుషోత్తం కు సన్మానం



క్రైమ్ కౌంటర్ న్యూస్ సూర్యాపేట జనవరి 08 :- సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రివేణి గార్డెన్ లో సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో 23 వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో సాహితి సంగీత అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన గా సూర్యాపేట కు చెందిన శ్రీ వాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం ను సిని సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్ షీల్డ్,శాలువాతో సన్మానించారు.బచ్చు పురుషోత్తం సుమధుర గీతాలు సోషల్ మీడియా గ్రూప్ ద్వారా ప్రతి రోజు రాత్రి 10 నుండి 11 గంటల వరకు సంగీత అభిమానులకు పలు సినిమాల్లోని సుమధుర గీతాలు ప్రసారం చేస్తున్నారు.ఈ సందర్భముగా సుధాబ్యాంక్ మేనేజింగ్ డైరక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఉదయం నుండి రాత్రి వరకు ఎంతో మంది బిజీగా వారి వారి పనుల్లో అలిసి పోయి సతమత అవుతున్న ప్రజలకు రాత్రి వేళ లో తాను సేకరించిన పాటలు సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేస్తూ వారికి మానసిక ప్రశాంతతను కలిగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంకు అధ్యక్షులు మీలా మహదేవ్,వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా ప్రముఖ రచయిత జర్నలిస్ట్ పులగం చిన్నారాయణ సుధా బ్యాంకు డైరెక్టర్లు తోట శ్యాంప్రసాద్, అప్పం శ్రీనివాస రావు , ఏపూరి శ్రవణ్ కుమార్, పటేల్ నరసింహారెడ్డి, అనంతుల శారద, సుజాత తదితరులు ఉన్నారు.

## ఎస్ టి యు క్యాలెండర్ ఆవిష్కరణ



క్రైమ్ కౌంటర్ న్యూస్ బేతవోలు జనవరి 8 చిలుకూరు మండల రిపోర్టర్ సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండలంలోని బేతవోలు హైస్కూల్ నందు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్ టి యు 2026 నూతన సంవత్సర క్యాలెండర్ని మండల విద్యాధికారి గురవయ్య గారిచే ఆవిష్కరించబడినది. ఇట్టి కార్యక్రమంలో చిలుకూరు మండల విద్యాధికారి మాగి గురవయ్య చిలుకూరు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సురగాని లింగయ్య, ప్రధాన కార్యదర్శి పుట్టపాక నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు, మండల నాయకులు రామిశెట్టి రామ నరసయ్య,కొండ ధన మూర్తి, ముదిగొండ సురేష్, వాసంశెట్టి నాగేశ్వరరావు, దొంగరి శ్రీను, కంపసాటి కృష్ణ, బాల్దురికల్పన,దొంగరి వెంకటేశ్వర్లు, కోనకంచి కరుణాకర్,కొండా రామాంజనేయులు, బెక్కం వెంకటేశ్వర్లు, గండు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని పిఆర్సి ని,వెంటనే ప్రకటించాలని 317 జీవోని, రద్దు చేయాలని జిపిఎఫ్ పెన్షన్, బకాయిలను, వెంటనే విడుదల చేయాలని సిపిఎస్ ని,రద్దుచేసి పూర్తిస్థాయిలో పాత పెన్షన్ విధానంను పునరుద్ధించాలని కోరారు.

## చిలుకూరు ఉన్నత పాఠశాలలో వాటర్ ప్యూరిఫైడ్ డిస్పెన్సర్ బహుకరణ




క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు జనవరి 8 :- చిలుకూరు మండల రిపోర్టర్ సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం చిలుకూరు మండల కేంద్రంలోని చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిలుకూరు కి చెందినటువంటి పీఏసీఎస్ చైర్మన్ అలస కాని జనార్ధన్ కూతురు మానస 12 వేల రూపాయలు విలువగల ప్యూరిఫైడ్ వాటర్ డిస్పెన్సర్ ను గ్రామ నూతన సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య గార్ల చేతుల మీదుగా పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలకు ఎంతో అవసరమైన ప్యూరిఫైడ్ వాటర్ డిస్పెన్సర్ను అందించారని కొనియాడారు. అలాగే చిలుకూరు గ్రామ ప్రజలు విద్యావంతులు ఇంకా ఇలాంటివి విద్యార్థులకు స్కూలుకు ఉపయోగపడే విధంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, చిలుకూరు గ్రామ సర్పంచ్ పాల్గొనడం జరిగింది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాంగ్రెస్ మంత్రులు..



తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం (జనవరి 8) మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. మేడారం సమ్మక్క, సారక్క మహా జాతర ఆహ్వాన పత్రికను అందజేసి.. వనదేవతల పండుగకు రావాలని కోరనున్నట్లు సమాచారం. కాగా, మేడారం జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహా జాతర జనవరి 28 నుంచి 31 వరకు జరగనుంది. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాంగ్రెస్ మంత్రులు వెళ్లనున్నట్లు సమాచారం. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌తో గురువారం (జనవరి 8న) మంత్రులు భేటీ కానున్నట్లు సమాచారం. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ సీఎంను కలవనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మేడారం సమ్మక్క, సారక్క మహా జాతర ఆహ్వాన పత్రికను అందించి.. వనదేవతల పండుగకు రావాలని కోరనున్నట్లు సమాచారం. కాగా, మేడాకం సమ్మక్క, సారక్క మహా జాతర.. జనవరి 28న ప్రారంభమై జనవరి 31న ముగియనుంది. ఈ పండుగకు ఇప్పటికే సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సంక్రాంతి సెలవులు కూడా ఉండటంతో ఈసారి జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహా జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వస్తారు. అందుకే ఈ వనదేవతల మహా జాతరను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం.. భారీగా నిధులు కేటాయించింది.మేడారం జాతర జరిగే ప్రాంతంతో పాటు పరిసర గ్రామాల్లో పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం. అంతేకాకుండా భద్రత, రవాణా, తాగునీరు, వైద్య సదుపాయాల ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని.. ఈసారి మేడారం జాతర కన్నుల పండువగా జరగనుందని అధికారులు చెబుతున్నారు.మేడారం మహా జాతరలో నాలుగు రోజులు ప్రధాన కార్యక్రమాలు జరుగుతాయి. జనవరి 28న కన్నెపల్లి నుంచి సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులను గద్దెలపైకి తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. జనవరి 29న చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దెపైకి తీసుకువస్తారు. జనవరి 30న భక్తులు అమ్మవార్లకు మొక్కులు (బంగారం) సమర్పించుకుంటారు. ఇక చివరి రోజు అయిన జనవరి 31న దేవతల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.మరోవైపు, ఈసారి జతరకు సమ్మక్క, సారక్క గద్దెలు కొత్త హంగులతో ముస్తాబవుతున్న విషయం తెలిసిందే. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా సహజ సిద్ధమైన రాతి కట్టడాలతో సమ్మక్క-సారక్క గద్దెలను నిర్మిస్తున్నారు. గద్దెల ఎత్తును పెంచడంతో పాటు.. చుట్టూ పాలరాతి గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీని కూడా తట్టుకునేలా గద్దెల ప్రాంగణాన్ని 180 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు విస్తరిస్తున్నారు. కాగా, జాతర ఏర్పాట్లను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న మేడారం వెళ్లనున్నారు.


## ఆ ప్రాంతంలో పెరుగుతున్న డిమాండ్స్..



తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలతో కొత్త జిల్లాల డిమాండ్లు ఊపందుకున్నాయి. గతంలో జరిగిన విభజన అశాస్త్రీయమని మంత్రి అనడంతో.. హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలని స్థానికులు ఉద్యమిస్తున్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జన్మస్థలమైన ఈ ప్రాంతాన్ని ఆయన పేరు మీదనే 'పీవీ నరసింహారావు జిల్లా'గా ఏర్పాటు చేయాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. పరిపాలన ప్రజలకు దగ్గరవ్వాలంటే హుజూరాబాద్ జిల్లా కేంద్రం కావడం అవసరమని నాయకులు స్పష్టం చేశారు. మంత్రి హామీ మేరకు ప్రభుత్వం త్వరలోనే ఈ దిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని.. దానిని పునర్వ్యవస్థీకరిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ ప్రాంత ప్రజలు తమ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ బాట పట్టారు. రాష్ట్రంలోని మండలాల నుంచి జిల్లాల వరకు విభజన ప్రక్రియ ప్రజల సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగిందని మంత్రి విమర్శించారు.ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల పరిధిలోకి వెళ్లడం వల్ల పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక తెప్పించి.. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఏ ప్రాతిపదికన జిల్లాలను మారుస్తారో అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో.. హుజూరాబాద్ పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మాజీ ప్రధాని, దివంగత నేత పీవీ నరసింహారావు ఈ గడ్డ బిడ్డ కావడంతో.. ఆయన గౌరవార్థం ఈ జిల్లాకు 'పీవీ నరసింహారావు జిల్లా' అని పేరు పెట్టాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుంచి అంబేద్కర్ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సైదాపూర్ క్రాసింగ్ వద్ద ఉన్న పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి తమ నిరసనను విన్నవించారు.హుజూరాబాద్ నియోజకవర్గం చుట్టుపక్కల ఉన్న మండలాలకు ఇది కీలకమైన వాణిజ్య కేంద్రంగా ఉంది. జిల్లా కేంద్రమైన కరీంనగర్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని ప్రభుత్వ సేవలు అందేలా జిల్లా హోదా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 33 జిల్లాలు ఉన్నాయి. ప్రజల డిమాండ్ మేరకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం భౌగోళిక సరిహద్దులు, జనాభా ప్రాతిపదికన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.హుజూరాబాద్ వంటి ప్రాంతాల్లో జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భూమి, భవనాల సౌకర్యాలను ప్రభుత్వం సమీక్షించాల్సి ఉంటుంది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం వంటి మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు అవసరమవుతాయి. మంత్రి పొంగులేటి చెప్పినట్లుగా కేబినెట్‌లో చర్చించి.. అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం హుజూరాబాద్ ప్రజలు చేస్తున్న డిమాండ్ ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. రాబోయే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం ఎలా పరిగణనలోకి తీసుకుంటుందో వేచి చూద్దాం.




## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చే వారికి అలర్ట్..



సంక్రాంతి పండుగ రద్దీ, స్టేషన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కీలక మార్పులు చేశారు. ముఖ్యంగా పార్కింగ్ స్థలం, ఎగ్జిట్ రూట్‌లను మార్చారు. ప్రయాణికులు ఈ కొత్త మార్గాలను గమనించి అధికారులకు సహకరించాలని కోరారు. రద్దీని తగ్గించేందుకు హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో 27 రైళ్లకు తాత్కాలిక హాల్ట్‌లు కల్పించారు. ఐటీ ఉద్యోగులు నేరుగా అక్కడే రైలు ఎక్కే వీలుంది. 'రైల్ వన్' యాప్ ద్వారా టికెట్లు కొంటే 3 శాతం రాయితీ లభిస్తుంది. సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రాకపోకల కోసం కీలక మార్పులు చేశారు. ప్రస్తుతం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనుల కారణంగా.. పార్కింగ్ స్థలాన్ని, స్టేషన్ నుంచి బయటకు వెళ్లే దారిని (ఎగ్జిట్ రూట్) ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు అధికారులు మార్చారు. పండుగకు ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్పులను గమనించి అధికారులకు సహకరించాలని రైల్వే శాఖ కోరింది.పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి నగరాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ రద్దీని తట్టుకోవడానికి దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 150 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ప్రయాణికుల రక్షణ కోసం స్టేషన్ పరిసరాల్లో అదనపు పోలీసు బలగాలను, రైల్వే భద్రతా సిబ్బందిని మోహరించారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీని తగ్గించేందుకు అధికారులు వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. జనవరి 7 నుంచి 20 వరకు సుమారు 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లను హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో ఆపనున్నారు. దీనివల్ల ఐటీ రంగంలో పనిచేసే ఉద్యోగులు సికింద్రాబాద్ వరకు రానవసరం లేకుండా తమకు దగ్గరలోని స్టేషన్లలోనే రైలు ఎక్కవచ్చు. ఇది అటు ప్రయాణికులకు సమయం ఆదా చేయడంతో పాటు.. ప్రధాన స్టేషన్లపై ఒత్తిడిని తగ్గిస్తుంది.పండుగ సమయంలో టికెట్ కౌంటర్ల వద్ద వేచి ఉండకుండా ఉండేందుకు రైల్వే శాఖ డిజిటల్ సేవలను ప్రోత్సహిస్తోంది. అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకునే వారు 'రైల్ వన్' మొబైల్ యాప్‌ను ఉపయోగించడం ద్వారా 3 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. స్టేషన్ పునర్నిర్మాణ పనుల వల్ల పార్కింగ్, ఎగ్జిట్ రూట్లు మారినందున, ప్రయాణికులు తమ రైలు సమయం కంటే కనీసం గంట ముందుగా స్టేషన్‌కు చేరుకోవడం ఉత్తమం.రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణికులు తమ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సంక్రాంతి ప్రయాణం సురక్షితంగా , సౌకర్యవంతంగా సాగడానికి రైల్వే అధికారులు చేస్తున్న ఈ ఏర్పాట్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

## రూ.100ల బిర్యానీ కేవలం రూ.5 మాత్రమే..




బిర్యానీపై ఉన్న మక్కువతో నల్గొండలో ప్రజలు భారీగా క్యూ కట్టారు. నల్గొండలోని సాయి శ్రీ కాలనీలో కొత్తగా ప్రారంభమైన 'సుగాలి ఫ్యామిలీ రెస్టారెంట్' తమ ఓపెనింగ్ రోజున ఐదు రూపాయలకే ప్లేట్ బిర్యానీ ఇస్తామని ఆఫర్ ప్రకటించింది. ఈ వార్త తెలియగానే హోటల్ తెరవకముందే వందలాది మంది బిర్యానీ ప్రియులు బారులు తీరారు. సాధారణంగా వందల్లో ఉండే బిర్యానీ ధర.. కేవలం ఐదు రూపాయలకే లభించడంతో జనం ఎగబడ్డారు. రుచికరమైన భోజనం అంటే భారతీయులకు గుర్తొచ్చే మొదటి పేరు బిర్యానీ. సాధారణంగా మనం బయటకు వెళ్ళినప్పుడు లేదా కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడపాలనుకున్నప్పుడు బిర్యానీ తినడానికి ప్రాధాన్యత ఇస్తుంటాం. సాధారణంగా ఒక సింగిల్ నాన్ వెజ్ బిర్యానీ ధర 100 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ఉంటుంది. కానీ.. కేవలం ఐదు రూపాయలకే బిర్యానీ లభిస్తుందంటే నమ్మగలరా..? నల్గొండ జిల్లాలో సరిగ్గా ఇదే జరిగింది.నల్గొండ పట్టణంలోని సాయి శ్రీ కాలనీలో కొత్తగా వెలసిన సుగాలి ఫ్యామిలీ రెస్టారెంట్ తమ ప్రారంభోత్సవం సందర్భంగా ఒక వినూత్నమైన ప్రకటన చేసింది. ఒక ప్లేట్ బిర్యానీని కేవలం ఐదు రూపాయలకే అందిస్తామని ప్రకటించింది. ఈ వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో.. ఉదయం నుంచే ప్రజలు హోటల్ ముందు బారులు తీరారు. హోటల్ ఇంకా తెరవకముందే వందలాది మంది క్యూ కట్టడం విశేషం. భారతీయ ఆహార సంస్కృతిలో బిర్యానీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. దీనికి ప్రధాన కారణం అందులో వాడే సుగంధ ద్రవ్యాలు, వండే విధానం. బిర్యానీలో వాడే ఇలాచీ, లవంగాలు, దాల్చిన చెక్క వంటి దినుసులు ఇచ్చే సువాసన ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తుంది. అన్నం, మాంసం, మసాలాలు అన్నీ కలిసి ఉండటం వల్ల ఇది ఒక పరిపూర్ణమైన భోజనంగా నిలుస్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు, పేద వారి నుంచి ధనికుల వరకు అందరూ ఇష్టపడే ఏకైక వంటకం బిర్యానీ. అందుకే ఏ చిన్న శుభకార్యమైనా బిర్యానీ కచ్చితంగా మెనూలో ఉంటుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొత్తగా హోటల్ వ్యాపారాన్ని మొదలుపెట్టే వారు కస్టమర్లను ఆకర్షించడానికి ఇటువంటి వింత ఆఫర్లను ప్రకటిస్తుంటారు. తక్కువ ధరకే బిర్యానీ ఇవ్వడం వల్ల ఆ హోటల్ పేరు ఊరంతా మారుమోగుతుంది. ప్రకటనలకు భారీగా ఖర్చు చేసే బదులు ఇలాంటి ఆఫర్లు మంచి ఫలితాన్ని ఇస్తాయి. ఒక్కసారి వచ్చి తిన్నవారికి రుచి నచ్చితే వారు భవిష్యత్తులో రెగ్యులర్ కస్టమర్లుగా మారే అవకాశం ఉంటుంది. ఇదే ఫార్ములాను చాలా మంది హోటల్ యజమానులు పాటిస్తుంటారు.



# టీమిండియాకు షాక్! తిలక్ వర్మకు గాయం..




టీ 20 వరల్డ్ కప్ 2026 ముందు టీమిండియాకు బ్యాడ్ న్యూస్ అనే చెప్పొచ్చు. ఆసియా కప్ హీరో తిలక్ వర్మ అబ్డొమినల్ ఇంజ్యూరీతో బాధపడుతూ న్యూజిలాండ్ టీ 20 సిరీస్‌తో పాటు టీ20 వరల్డ్‌కప్‌కు దూరమయ్యే ప్రమాదం ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో తిలక్‌కు సమస్య తలెత్తగా.. శస్త్రచికిత్స అవసరమైతే మూడు వారాల విశ్రాంతి తప్పదని వైద్యులు సూచించారు. దీంతో టీమిండియా మిడిల్ ఆర్డర్‌లో ప్రత్యామ్నాయాలపై సెలెక్టర్లు దృష్టి సారించనున్నారు. టీమిండియాకు మరో కీలక దెబ్బ తగిలేలా కనిపిస్తోంది. ఆసియా కప్ హీరో తిలక్ వర్మ ప్రస్తుతం అబ్డొమినల్ ఇంజ్యూరీ (ఛాతి నుంచి నడుము వరకు ఉన్న కడుపు భాగంలో మసిల్స్‌కు వచ్చే గాయం)తో బాధపడుతున్నాడు. ఈ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లో తిలక్ ఆడటం అనుమానంగా మారింది. అంతేకాదు, ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్‌కప్‌లో అతని స్థానం కూడా సందేహంలో పడింది. గత ఏడాది నుంచి భారత టీ20 జట్టులో కీలక మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ఎదిగిన తిలక్ వర్మ, ఆసియా కప్‌లోనూ అద్భుత ప్రదర్శన చేశాడు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో చేసిన హాఫ్ సెంచరీ టైటిల్ విజయంలో కీలక పాత్ర పోషించింది. నేషనల్ మీడియా కథనం ప్రకారం విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ తరఫున ఆడుతున్న సమయంలో రాజ్‌కోట్‌లో తిలక్‌కు అబ్డొమినల్ సమస్య తలెత్తింది. ఆ తర్వాత బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వైద్యులు పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించినట్లు సమాచారం. వైద్యుల అంచనా ప్రకారం, శస్త్రచికిత్స జరిగితే కనీసం మూడు నుంచి నాలుగు వారాల రికవరీ టైమ్ అవసరం అవుతుంది. దీంతో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ మొత్తానికి తిలక్ దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే సమయంలో, యూఎస్ఏతో జరిగే టీ20 వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌కి కూడా అతను అందుబాటులో ఉండకపోవచ్చనే ఆందోళన టీమ్ మేనేజ్‌మెంట్‌లో నెలకొంది.తిలక్ వర్మ దూరమైతే, టీమిండియా మిడిల్ ఆర్డర్‌లో మార్పులు తప్పవు. సెలెక్షన్ కమిటీ మరోసారి ప్రత్యామ్నాయాలపై చర్చించే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ వంటి పేర్లు మళ్లీ పరిశీలనలోకి రావొచ్చు. అలాగే రియాన్ పరాగ్ కూడా రేసులోకి రావచ్చు. కీలక టోర్నీ ముందు అనుభవం, ఫామ్ రెండింటినీ సమతుల్యం చేసే దిశగా సెలెక్టర్లు అడుగులు వేయనున్నారు.టీ20ల్లో తిలక్ వర్మ ఆగస్టు 2023లో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు 40 టీ20 మ్యాచ్‌లు ఆడి 1,183 పరుగులు చేశాడు. 2 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు సాధించాడు. జట్టుకు అవసరమైనప్పుడు బౌలింగ్ కూడా చేయగలడు. ఇప్పటి వరకు మూడు వికెట్లు తీసుకున్నాడు.

# టీ20 వరల్డ్‌కప్ ముందే మంటపెట్టిన పాక్ స్టార్..




టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందే పాకిస్తాన్ బౌలర్ షాహీన్ అఫ్రిది భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. సరిహద్దు అవతల క్రీడాస్ఫూర్తి లేదని, మైదానంలోనే సమాధానం చెబుతామని అన్నాడు. రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ – పాక్ మ్యాచ్‌పై అంచనాలు పెరిగాయి. ఈ వ్యాఖ్యలు పోరుకు మరింత మసాలా జోడించాయి. ఒకవైపు బంగ్లాదేశ్ – భారత్ మధ్య క్రికెట్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో, షాహీన్ షా అఫ్రిది కూడా వ్యాఖ్యలు చేయడంతో టోర్నీ మరింత హీటెక్కింది. టీ20 వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందే టోర్నీ హీటెక్కింది. ఒకవైపు భారత్ – బంగ్లాదేశ్ కాంట్రవర్సీతో రచ్చ అవుతున్న సమయంలో, మరోవైపు పాకిస్తాన్ ప్రీమియమ్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది చేసిన కామెంట్స్ ఇప్పుడు మరో మంట పెట్టింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. ఈ ప్రపంచకప్‌లో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న మ్యాచ్ ఫిబ్రవరి 15న జరగనున్న భారత్– పాకిస్తాన్ పోరు. ఆసియా కప్ 2025 ఫైనల్ తర్వాత ఈ రెండు జట్లు తలపడటం ఇదే తొలిసారి. ఈ కీలక మ్యాచ్‌కు ఇంకా నెలరోజుల సమయం ఉండగానే పాకిస్తాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి చర్చకు తెరలేపాడు. పాకిస్తాన్‌లో మీడియాతో మాట్లాడిన షాహీన్, భారత్‌లో క్రీడాస్ఫూర్తి లోపించిందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. "సరిహద్దు అవతల క్రీడాస్ఫూర్తి కనిపించడం లేదు. మేము మైదానంలోనే సమాధానం ఇస్తాం" అని షాహీన్ వ్యాఖ్యానించాడు.భారత్ – పాకిస్తాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు గత కొన్నేళ్లుగా తీవ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కూడా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది.ఈ నేపథ్యంలో ఆసియా కప్ 2025లో భారత్, పాకిస్తాన్ జట్లు మూడుసార్లు తలపడ్డాయి. ఆ మ్యాచ్‌ల ముందు, తర్వాత భారత జట్టు ఆటగాళ్లు పాకిస్తాన్ ఆటగాళ్లతో హ్యాండ్ షేక్ చేయకపోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఫైనల్ అనంతరం ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్, పీసీబీ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ ట్రోఫీని భారత్‌కు అందించకుండా తీసుకెళ్లిన ఘటన కూడా వివాదంగా మారింది.ఈ పరిణామాల నేపథ్యంలో టీ20 వరల్డ్‌కప్ 2026లో భారత్ – పాకిస్తాన్ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. షాహీన్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలు ఈ పోరుకు మరింత మసాలా జోడించాయి. రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం మైదానంలో ఎలా కనిపిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.టీ – 20 వరల్డ్‌కప్ 2026కు భారత జట్టుసూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్.

# వడోదరాలో విరాట్ కోహ్లి ఎంట్రీ..



న్యూజిలాండ్‌తో తొలి వన్డే కోసం వడోదరలో అడుగుపెట్టిన విరాట్ కోహ్లీని చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో ఫామ్‌లో ఉన్న కోహ్లీ, లిస్ట్ – ఏలో 16 వేల పరుగులు పూర్తి చేసి సచిన్ రికార్డును బద్దలు కొట్టాడు. అంతర్జాతీయంగా 28 వేల పరుగుల మైలురాయికి చేరువలో ఉన్న కోహ్లీపై అందరి దృష్టి నెలకొంది. జనవరి 11 నుంచి భారత్ – న్యూజిలాండ్ వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. భారత్ – న్యూజిలాండ్ తొలి వన్డే మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వడోదరాలో అడుగుపెట్టాడు. దాంతో కింగ్ కోహ్లీని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వడోదరా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న కోహ్లీని చూడటానికి ఫ్యాన్స్ ఉత్సాహంతో చుట్టుముట్టారు. ఈ క్రమంలో భద్రతా సిబ్బందికి కోహ్లీని కార్ వరకు తీసుకెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.భారత్ – న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుండగా తొలి మ్యాచ్ జనవరి 11న వడోదరాలోని బీసీఏ స్టేడియంలో నిర్వహించనున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో వన్డేలు మాత్రమే ఆడుతున్న కోహ్లీ, ఈ సిరీస్ కోసం గుజరాత్ నగరానికి చేరుకున్నాడు.ఇటీవల విజయ్ హజారే ట్రోఫీతో దేశవాళీ క్రికెట్‌కు తిరిగి వచ్చిన విరాట్ కోహ్లీ, లిస్ట్–ఏ ఫార్మాట్‌లో 15 ఏళ్ల తర్వాత ఆడుతూ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. రెండు మ్యాచ్‌ల్లో 131, 77 పరుగులు చేసి ఫామ్‌లో ఉన్నానని చాటాడు. అంతేకాదు, లిస్ట్–ఏ క్రికెట్‌లో 16,000 పరుగులు పూర్తి చేసిన వేగవంతమైన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు. గత అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనతో అంతర్జాతీయ క్రికెట్‌కు రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ ఆరంభంలో రెండు డకౌట్లు ఎదురైనా ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో వరుస శతకాలు సాధించి టీమిండియా తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు.ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో 27,975 పరుగులు చేసిన కోహ్లీ, 28 వేల పరుగుల మైలురాయికి కేవలం 25 పరుగుల దూరంలో ఉన్నాడు. ఈ ఘనత సాధిస్తే సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర తర్వాత ఈ ఘనత సాధించిన మూడో ఆటగాడిగా నిలవనున్నాడు. ఇప్పటివరకు 623 ఇన్నింగ్స్‌ల్లో 84 శతకాలు, 145 అర్ధశతకాలతో కోహ్లీ అద్భుత రికార్డు కొనసాగుతోంది.న్యూజిలాండ్‌పై కూడా విరాట్ కోహ్లీకి గొప్ప రికార్డే ఉంది. 33 వన్డేల్లో 1,657 పరుగులు చేసి, ఆరు శతకాలు, తొమ్మిది అర్ధశతకాలు సాధించాడు. వడోదరాలో జరిగే తొలి వన్డేలో కూడా కోహ్లీ మరోసారి తన క్లాస్ చూపిస్తాడేమో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దెబ్బకు దారికొచ్చిన బంగ్లాదేశ్..!




ఐపీఎల్ నుంచి బంగ్లా ప్లేయర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించడంతో పెద్ద దుమారం చెలరేగింది. దీనికి నిరసనగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించింది. అంతేకాకుండా టీ20 వరల్డ్ కప్ 2026 కోసం భారత్‌లో పర్యటించబోమని.. మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో బీసీబీ తీరుపై.. ఐసీసీ కఠిన వైఖరి అవలంభించిందని వార్తలు వచ్చాయి. దీంతో బంగ్లాదేశ్ వెనక్కి తగ్గి.. భారత్‌లోనే టీ20 వరల్డ్ కప్ ఆడతామని తెలిపింది. ఆటగాళ్ల భద్రతకు తాము ప్రాధాన్యత ఇస్తామని బీసీబీ పేర్కొంది. బంగ్లాదేశ్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీని వల్ల వివాదం తలెత్తి బంగ్లాదేశ్ ప్రభుత్వం మధ్యలో దూరడంతో పెద్దదైంది. దీంతో బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించింది. అంతేకాకుండా టీ20 వరల్డ్ కప్ 2026 కోసం తాము భారత్‌లో పర్యటించబోమని బంగ్లాదేశ్ గత కొద్ది రోజులుగా చెబుతోంది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని అంటోంది. అందుకోసం ఈ మెగా టోర్నీ షెడ్యూల్‌లో మార్పులు చేయాలని ఐసీసీకి కూడా లేఖలు రాసి.. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది. అయితే దీనిపై ఐసీసీ తీవ్రంగా స్పందించిందని వార్తలు రావడంతో.. తోకముడిచి తాము భారత్‌లోనే టీ20 వరల్డ్ కప్ ఆడతాం అని తెలిపింది!భారత్‌లో జరిగే టీ20 ప్రపంచ కప్ 2026 విషయంలో.. బంగ్లాదేశ్ చేసిన డిమాండ్‌పై ఐసీసీ కఠిన వైఖరి అవలంభించిందని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దాని ప్రకారం.. ఐసీసీ ఛైర్మన్ జై షా నేతృత్వంలో జరిగిన వర్చువల్ సమావేశంలో.. భద్రతా కారణాలంటూ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చడం సాధ్యం కాదని బీసీబీకి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా టీ20 వరల్డ్ కప్‌లో పాల్గొనడం సభ్య దేశాల బాధ్యత అని.. భారత్‌కు రాకపోతే పాయింట్లు కోల్పోవాల్సి వస్తుందని కూడా ఐసీసీ హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు దారిలోకి వచ్చింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది.

# హార్దిక్ 19 బంతుల్లో 50, జితేశ్ 23 బంతుల్లో 50..




విజయ్ హజారే ట్రోఫీలో హార్దిక్ పాండ్యా తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి, 31 బంతుల్లో 75 పరుగులు చేశాడు. జితేశ్ శర్మ కూడా 33 బంతుల్లో 73 పరుగులు చేశాడు. యువ బ్యాటర్ ప్రియాన్ష్ మోలియా కూడా సెంచరీతో రాణించడంతో బరోడా 391 పరుగులు చేసింది. టీ 20 ప్రపంచకప్‌కు సన్నద్ధమవుతున్న హార్దిక్ పాండ్యా విజయ్ హజారే టోర్నీని ప్రాక్టీస్‌గా వాడుకుంటున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ హార్దిక్ పాండ్యా తన మార్క్ బ్యాటింగ్‌ని మరోసారి ప్రదర్శించాడు. మొన్నామధ్య ఒకే ఓవర్‌లో ఐదు సిక్సర్లు, ఒక ఫోర్ బాది తానేంటో నిరూపించిన పాండ్యా.. మళ్లీ ఇప్పుడు కేవలం 19 బంతుల్లోనే ఆరు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. గ్రూప్ బీలో భాగంగా ఛండీఘఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బరోడా తరఫున మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కి వచ్చిన పాండ్యా ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. హార్దిక్ పాండ్యాకి తోడు మరో హిట్టర్ జితేశ్ శర్మ కూడా రెచ్చిపోవడంతో బరోడా భారీ స్కోర్ నమోదు చేసింది. జితేశ్ శర్మ కూడా కేవలం 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మరో యువ బ్యాటర్ ప్రియాన్ష్ మోలియా సెంచరీతో చెలరేగిపోవడంతో బరోడా 49.1 ఓవర్లలో 391 పరుగులకు ఆలౌట్ అయింది.న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్, ఆ తర్వాత టీ20 వరల్డ్‌కప్ ఉండటంతో హార్దిక్ పాండ్యా విజయ్ హజారే ట్రోఫీని ప్రాక్టీస్ సెషన్‌గా ఉపయోగించుకుంటున్నాడు. టీ20 వరల్డ్ కప్ కోసం సిద్ధమవుతున్న హార్దిక్‌ను న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేయకుండా బుమ్రాతో పాటు బీసీసీఐ రెస్ట్ ఇచ్చింది. దాంతో హార్దిక్ విజయ్ హజారేలో రెచ్చిపోయి ఆడుతున్నాడు.కేవలం 19 బంతుల్లోనే సెంచరీ చేసిన హార్దిక్ పాండ్యా మొత్తం 31 బంతులు ఆడి రెండు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 75 పరుగులు చేసి అవుటయ్యాడు. జితేశ్ శర్మ కూడా 33 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, 4 సిక్సర్లతో 73 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. ఫస్ట్ డౌన్ బ్యాటర్ ప్రియాన్ష్ మోలియా మాత్రం తన క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 106 బంతులు ఆడిన మోలియా పది ఫోర్లు, ఒక సిక్సర్‌తో 113 పరుగులు చేశాడు.కెప్టెన్ కృనాల్ పాండ్యా 23 బంతుల్లో కేవలం 20 పరుగులే చేసి విఫలమయ్యాడు. విష్ణు సోలంకి 49 బంతుల్లో 54 పరుగులు చేశాడు. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన ప్రియాన్ష్ ఏడో వికెట్ వరకూ క్రీజులో నిల్చున్నాడు. ఎప్పుడయితే ప్రియాన్ష్ అవుటయ్యాడే స్కోర్ బోర్డు ఒక్కసారిగా డీలా పడింది. దాంతో 400 మార్క్ అందుకుంటుంది అనుకున్న బరోడా జట్టు 49.1 ఓవర్లలో 391 పరుగులకు ఆలౌట్ అయింది.

# సిడ్నీ టెస్టులో ఆసీస్ విజయం..



యాషెస్ సిరీస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా విజయం సాధించింది. ఐదు టెస్టుల సిరీస్‌ను 4 – 1తో ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. ఆసక్తికరంగా సాగిన సిడ్నీ టెస్టులో అలెక్సీ క్యారీ, కామెరూన్ గ్రీన్ అద్భుత భాగస్వామ్యంతో ఆసీస్ సునాయాస విజయం సాధించింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో జాకబ్ బేతెల్ సెంచరీతో రాణించినా, ఆసీస్ లక్ష్యాన్ని సులువుగా ఛేదించింది. ఈ సిడ్నీ టెస్టులో మొత్తం నలుగురు బ్యాటర్లు సెంచరీలు చేయడం విశేషం. యాషెస్ సిరీస్ ఆఖరి టెస్టులో ఆస్ట్రేలియా విజయం సాధించింది. ఆసక్తికరంగా సాగిన సిడ్నీ టెస్టులో ఆసీస్‌నే విజయం వరించింది. ఆఖరి రోజు వరకూ సాగిన ఈ టెస్టులో చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. ఒకానొక దశలో వరుస వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియాను మిడిలార్డర్ బ్యాటర్లు అలెక్సీ క్యారీ, కామెరూన్ గ్రీన్ నిలబెట్టడంతో సునాయాస విజయం లభించింది. దాంతో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌ను ఆసీస్ 4 – 1తో సొంతం చేసుకుంది. 302/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు మరో 40 పరుగులు చేసి ఆలౌట్ అయింది. సెంచరీతో దుమ్మురేపిన జాకబ్ బేతెల్ 150 కూడా సాధించాడు. 265 బంతులు ఆడిన బేతెల్ 15 ఫోర్లతో 154 పరుగులు చేసి అవుటయ్యాడు. బేతెల్ అవుటైన తర్వాత జోష్ టంగ్, మాథ్యూ పాట్స్ ఆఖరి వికెట్‌కు 14 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మిచెల్ స్టార్క్, వెబ్‌స్టర్ చెరో మూడు వికెట్లు తీసుకోవడంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌట్ అయింది.తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాకు ఆధిక్యం దక్కడంతో.. రెండో ఇన్నింగ్స్‌లో విజయానికి కేవలం 159 పరుగులు మాత్రమే కావాల్సి వచ్చాయి. దాంతో ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, జేక్ వెథరాల్డ్ మంచి భాగస్వామ్యం అందించారు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో విజయం మరింత సులువు అయింది.ఈ ఇద్దరు అవుటైన తర్వాత వెంటవెంటనే వికెట్లు పడటం మొదలయ్యాయి. విజయానికి 39 పరుగులు కావాల్సిన సమయంలో ఆస్ట్రేలియా ఐదు వికెట్లు కోల్పోయింది. దాంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో అలెక్స్ క్యారీ, కామెరూన్ గ్రీన్ ఇద్దరూ కలిసి మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ని ముగించారు. ఈ టెస్టులో ఇంగ్లండ్ తరఫున జో రూట్, జాకబ్ బేతెల్ సెంచరీలు చేయగా.. ఆస్ట్రేలియా తరఫున ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ శతకాలు బాదారు. మొదటి మూడు టెస్టుల్లో వరుసగా విజయం సాధించిన ఆస్ట్రేలియా నాలుగో టెస్టులో ఓడిపోయింది. ఇక చివరిదయిన సిడ్నీ టెస్టులో విజయం సాధించి 4 –1తో సిరీస్ సొంతం చేసుకుంది.




# ఎట్టకేలకు తెలుగులోకి శివ కార్తికేయన్ సినిమా..




శివకార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ నటించిన సైన్స్ ఫిక్షన్ మూవీ 'అయలాన్' ఎట్టకేలకు తెలుగు ఓటీటీలోకి వచ్చింది. 2024లో తమిళంలో విడుదలై విజయం సాధించిన ఈ చిత్రం, వివిధ కారణాల వల్ల తెలుగులో థియేటర్ రిలీజ్ కాలేదు. గత నెలలో నేరుగా టీవీలో ప్రసారమైన ఈ మూవీ, 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఒక గ్రహాంతరవాసి (ఏలియన్) భూమి మీదకు రావడం, హీరోతో కలిసి సాగించే సాహసాలు పిల్లలను, ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తున్నాయి. తమిళ స్టార్ శివకార్తికేయన్, గ్లామరస్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన ప్రయోగాత్మక చిత్రం ' అయలాన్ '. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో ఏలియన్ కథాంశంతో సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ కామెడీ జోనర్ లో ఈ చిత్రం తెరకెక్కింది. శరద్ కేల్కర్, యోగిబాబు, భానుప్రియ, ఇషా కొప్పికర్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. రెండేళ్ల క్రితం తమిళంలో విడుదలై మంచి విజయం సాధించింది. శివకార్తికేయన్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. అయితే దాదాపు రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు ఇప్పుడు తెలుగులోకి వచ్చింది.'అయలాన్' చిత్రాన్ని 2024 సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. శివకార్తికేయన్ కి తెలుగులో ఉన్న మార్కెట్ ని దృష్టిలోం పెట్టుకొని, హైదరాబాద్ వచ్చి ప్రమోషన్స్ కూడా నిర్వహించారు. ఆ తర్వాత జనవరి 26న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాలు, ఆర్థిక పరమైన ఇబ్బందుల వల్ల తెలుగు వెర్షన్ థియేటర్లలో రిలీజ్ కాలేదు. ఆ తర్వాత తమిళ వెర్షన్ సన్ నెక్ట్స్ ఓటీటీలోకి వచ్చినప్పటికీ, తెలుగు డబ్బింగ్ వెర్షన్ మాత్రం అందుబాటులోకి రాలేదు. దాదాపు రెండేళ్ల నిరీక్షణకు తెరదించుతూ, ఆహా ఓటీటీలో ప్రత్యక్షమైంది. 'అయలాన్' సినిమా గత నెల డిసెంబర్‌లో నేరుగా 'జీ తెలుగు' ఛానల్‌లో ప్రసారం చేయడం ద్వారా తొలిసారిగా తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఇక ఎప్పుడెప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్ మీదకు వస్తుందా అని ఓటీటీ ప్రియులు ఎదురుచూస్తుండగా, ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఆహా'లో జనవరి 7 నుంచి ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఎటువంటి ముందస్తు హడావిడి లేకుండా సడన్‌గా తెలుగులోకి తీసుకొచ్చారు. దీనికి తెలుగుఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. 'అయలాన్' కథేంటంటే.. సేంద్రీయ వ్యవసాయం చేసే హీరో శివకార్తికేయన్ కు నష్టాలు వస్తుంటాయి. దీంతో సిటీకి వెళ్లి ఏదైనా ఉద్యోగం చేసి బతకాలని తల్లి అతడిని సిటీకి పంపుతుంది. మరోవైపు ఆర్యన్ అనే సైంటిస్టు తన వద్ద ఉన్న స్పార్క్ అనే గ్రహ శకలంతో, ఆఫ్రికాలో ఫ్యూయల్‌కు ప్రత్యామ్నాయంగా నోవా గ్యాస్‌ను తయారు చేసే పనిలో ఉంటాడు. ఆ ప్రయోగం ఫెయిల్ అవ్వడంతో అక్కడ చాలా మంది చనిపోతారు. దాంతో ఇండియాకు వచ్చి రహస్యంగా ప్రయోగాలు చేయడం మొదలు పెడతాడు. అయితే స్పార్క్ కోసం ఓ గ్రహం నుంచి భూమ్మీదకు వచ్చిన ఒక ఎలియన్.. అనుకోకుండా హీరో వద్దకు చేరుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? హీరో దగ్గరకు ఆ ఏలియన్ ఎందుకు వచ్చింది? ఆర్యన్ చేసే ప్రయోగాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి?, హీరో ఆ ఏలియన్‌తో కలిసి సాగించిన సాహస యాత్ర ఏంటి?, చివరకు కథ ఎలా ముగిసింది? అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం, నిరవ్ షా సినిమాటోగ్రఫీ నిర్వహించారు.

# 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ చూశారా?




నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నటించిన 'అనగనగా ఒక రాజు' చిత్రం ట్రైలర్ విడుదలైంది. అక్కినేని నాగార్జున వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ఈ ట్రైలర్.. నవీన్ కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంది. సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ థియేటర్లలో రిలీజ్ కానుంది. నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి హీరో హీరోయిన్‌లుగా నటించిన లేటెస్ట్ మూవీ ' అనగనగా ఒక రాజు '. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో సూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకి సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. జనవరి 14న గ్రాండ్ గా థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రైలర్ ను రిలీజ్ చేశారు."అనగనగా ఒక రాజు.. ఆ రాజుకి చాలా పెద్ద మనసు" అంటూ అక్కినేని నాగార్జున వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. నవీన్ పోలిశెట్టి తన మార్క్ కామెడీ టైమింగ్ తో అలరించారు. మీనాక్షి అందంగా కనిపించింది. రాజు గారి పెళ్లి చుట్టూ ఈ కథను అల్లుకున్నట్లు అర్థమవుతోంది. సంక్రాంతి పండక్కి తగ్గట్టుగా కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ గా రూపొందినట్లు తెలుస్తోంది. 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై తెరకెక్కించారు. మిక్కీ జె. మేయర్ సంగీతం సమకూర్చారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సంక్రాంతి బరిలో నవీన్ పోలిశెట్టి ఎలాంటి సక్సెస్ సాధిస్తారో చూడాలి.

# అందుకే పవన్ కళ్యాణ్ సినిమా వదులుకున్నా



పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుండి తప్పుకోవడానికి గల కారణాలను నటి సాక్షి వైద్య వెల్లడించారు. వారం రోజులు షూటింగ్‌లో పాల్గొన్నా, కుటుంబ అత్యవసర పరిస్థితుల వల్ల డేట్లు సర్దుబాటు చేయలేక ఆ అవకాశం వదులుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం శర్వానంద్ సరసన 'నారీ నారీ నడుమ మురారి'లో 'నిత్య' అనే అమాయకపు అమ్మాయి పాత్రలో నటిస్తున్నానని, ఈ సంక్రాంతికి ఈ చిత్రం తనకి మంచి విజయాన్ని అందిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చిత్రంలో నటించే అవకాశం రావడం ఏ హీరోయిన్ కైనా అదృష్టమే. అటువంటి గోల్డెన్ ఛాన్స్ దక్కించుకొని కూడా, కొన్ని అనివార్య కారణాలతో ఆ సినిమా నుంచి తప్పుకుంది అందాల భామ సాక్షి వైద్య . అఖిల్ అక్కినేని హీరోగా రూపొందిన 'ఏజెంట్' సినిమాతో టాలీవుడ్‌కు హీరోయిన్ గా పరిచయమైన ఈ బ్యూటీ.. ఆ తర్వాత 'గాండీవధారి అర్జున' మూవీతో మరో పరాజయాన్ని చవి చూసింది. దీంతో ఆమెకు తెలుగులో అవకాశాలు కష్టమే అనుకున్నారంతా. అలాంటి టైంలో పవన్ కళ్యాణ్ సినిమా ఆఫర్ అమ్మడి తలుపు తట్టింది. కానీ చివరకు ఆ ప్రాజెక్ట్ ను వదులుకుంది.పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఇందులో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాశీ ఖన్నా పాత్ర కోసం మొదట సాక్షి వైద్యను ఎంపిక చేశారు. దానికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చింది. కొన్ని రోజులు షూటింగ్ కూడా చేసింది. ఏమైందో ఏమో తెలియదు కానీ సడన్ గా ఆమె స్థానంలోకి రాశీ వచ్చి చేరింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాక్షి.. పవన్ కళ్యాణ్ సినిమా నుంచి తప్పుకోడానికి గల కారణాలను వివరించింది. 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ పక్కన నటించే ఛాన్స్ వచ్చినపుడు తాను ఎంతో సంతోషించానని, వారం రోజులు చిత్రీకరణలో కూడా పాల్గొన్నట్లు సాక్షి వైద్య తెలిపింది.



అయితే తన ఫ్యామిలీ అత్యవసర పరిస్థితి కారణంగా తాను వేరే ఊరు వెళ్లాల్సి వచ్చిందని, అదే సమయంలో చిత్ర యూనిట్ నుంచి ఫోన్ వచ్చిందని, నెక్ట్స్ డే షూటింగ్ లో పాల్గొనాలని చెప్పారని, కానీ తిరిగి వెళ్లలేని పరిస్థితుల్లో డేట్లు సర్దుబాటుచేయలేక ఆ ప్రాజెక్ట్ వదులుకున్నానని సాక్షి చెప్పింది. భవిష్యత్తులో మళ్లీ ఎప్పుడైనా పవన్‌తో కలిసి నటించే అవకాశం వస్తే వదులుకోనని, అలాంటి ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పుకొచ్చింది.సాక్షి వైద్య ప్రస్తుతం శర్వానంద్ సరసన 'నారీ నారీ నడుమ మురారి' సినిమాలో ఒక హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న రిలీజ్ కానుంది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాలో సంయుక్త మీనన్ మరో కథానాయిక. 'ఏజెంట్' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలోనే నిర్మాత అనిల్ తనతో మరో సినిమా చేస్తానని చెప్పారని, ఆయన మాట నిలబెట్టుకున్నారని సాక్షి వైద్య చెబుతోంది. ఇందులో నిత్య అనే క్యారెక్టర్ లో నటించానని, తను నిజాయితీగా ఇన్నోసెంట్ గా కనిపించే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని తెలిపింది. శర్వాతో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని, ఆయన కామెడీ టైమింగ్ అద్భుతమని, అతడితో కలిసి పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్ అని సాక్షి పేర్కొంది.

# మోడ్రన్ డ్రెస్ వేసుకున్న గురు వెంకటేష్..




చిరంజీవి, వెంకటేష్ కలిసి నటించిన సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్ బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. సినిమా షూటింగ్ అంతా ఒక పిక్నిక్‌లా సాగిందని తెలిపారు. వెంకటేష్‌ను "మోడ్రన్ డ్రెస్ వేసుకున్న గురువు"గా అభివర్ణించిన చిరు.. సంక్రాంతికి తన సినిమాతో పాటు వస్తున్న ప్రభాస్, రవితేజ, శర్వానంద్, నవీన్ పోలిశెట్టి సినిమాలు కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చిరంజీవి హీరోగా వెంకటేష్ కీలక పాత్రలో నటించిన సినిమా ' మన శంకర వరప్రసాద్ గారు '. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నయనతార హీరోయిన్ గా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా హైదరాబాద్‌లో ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి చిరు – వెంకీలతో పాటుగా పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. సంక్రాంతికి వస్తున్న సినిమాలన్నీ హిట్ కావాలి, నిర్మాతలు సుభిక్షంగా ఉన్నప్పుడే అసలైన సంక్రాంతి అని ఈ సందర్భంగా చిరంజీవి అన్నారు.చిరంజీవి మాట్లాడుతూ.. "నా మిత్రుడు, సోదర సమానుడు, అత్యంత ఆప్తుడు వెంకీతో కలిసి చేయటం అన్నది నాకు చాలా ఎక్సైటింగ్ ఉంది. అదిరిపోద్ది సంక్రాంతి అంటే, అది కేవలం 'మన శంకర వరప్రసాద్ గారు'దే కాదు.. ఈ సంక్రాంతి మొత్తం మన తెలుగు పరిశ్రమది అవ్వాలని మనస్ఫూర్తిగా నేను కోరుకుంటున్నాను. డార్లింగ్ ప్రభాస్ 'రాజా సాబ్', అన్నయ్య అంటూ ఆప్యాయంగా పిలిచే నా తమ్ముడు రవితేజ సినిమా, అలాగే మా ఇంట్లో సరదాగా తిరుగుతూ చిన్నప్పటి నుంచి నా కళ్ల ముందు పెరిగిన శర్వానంద్ నటించిన 'నారీ నారీ నడుమ మురారి', నన్ను గురువుగా భావిస్తూ నాకొక ఒక శిష్యుడిగా ఉన్న నవీన్ పోలిశెట్టి సినిమా.. ఇవన్నీ కూడా ఈ సంక్రాంతికి సూపర్ హిట్ అవ్వాలి. వాళ్ళకి విజయం లభించాలి" "నిర్మాతలు బయ్యర్లు సుభిక్షంగా ఉన్నప్పుడే, నిజమైన సంక్రాంతి. తెలుగు సినిమా పరిశ్రమకు అటువంటి సంక్రాంతి కావాలనే కోరుకుంటున్నాను. అదే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను. ప్రేక్షకులు మంచి విజయం అందిస్తారనే ప్రగాఢ నమ్మకం నాకుంది. 2026 సంక్రాంతి తెలుగు పరిశ్రమ మర్చిపోకూడదు. అలాంటి సంక్రాంతి ఆడియన్స్ మాకు ఇవ్వాలి. ఎందుకంటే ఈసారి పండక్కి వస్తున్న సినిమాలన్నీ కామెడీ, ఫ్యామిలీ, ఎంటర్టైన్మెంట్ జోనర్ లో రూపొందిన పర్ఫెక్ట్ సంక్రాంతి సినిమాలు. కాబట్టి ఈ సంక్రాంతికి అన్ని సినిమాలు బాగాడతాయి అనుకుంటున్నాను. ఆడేలా చేసే బాధ్యత ప్రేక్షకులదే. దయచేసి అన్ని సినిమాల్ని థియేటర్ కి వెళ్లి చూడండి. థియేటర్లోనే ఆశీర్వదించండి" అని అన్నారు."చాలా కాలం క్రితం దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు నాతో మాట్లాడుతూ 'బాబాయ్.. నువ్వు అనిల్ రావిపూడి సినిమాలు ఎన్ని చూసావో తెలియదు కానీ, అతని కామెడీ టైమింగ్, హుషారు చూస్తుంటే.. మీ ఇద్దరి కాంబినేషన్ లో ఒక సినిమా వస్తే వేరే లెవెల్లో ఉంటుంది. మీరు త్వరగా కలిసి చేయాలని నేను కోరుకుంటున్నాను' అని అన్నారు. ఆయన చేతుల మీదగానే క్లాప్ కొట్టి ఈ సినిమాని ప్రారంభించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత అనిల్ నా దగ్గరికి వచ్చిఈ కథాంశం చెప్పినప్పుడు, 'చాలా బాగుంది. ఫ్యామిలీ టచ్ ఉంది. సెంటిమెంట్ ఉంది. చిన్న పిల్లలతో నాకు అటాచ్మెంట్ ఉంది. చాలా హృద్యంగా ఉంది. హార్ట్ టచింగ్ సీన్స్ ఉన్నాయి. ఇలాంటి సినిమాకి కామెడీ జోనర్ కలిస్తే, నీ స్టైల్ లో చాలా బాగుంటుంది' అని అన్నాను""సినిమాలో నాది ఒక న్యూ+ క్యారెక్టర్ కాబట్టి, నేను కొంచెం వైవిధ్యంగా డిఫరెంట్ గా చేస్తే డెఫినెట్ గా బాగుంటుందన్నాను. కానీ అనిల్ అస్సలు వైవిధ్యం వద్దు అన్నాడు. 'దొంగ మొగుడు', 'ఘరానా మొగుడు', 'రౌడీ అల్లుడు', 'అన్నయ్య', 'చంటబ్బాయి' సినిమాల్లో ఎలా ఉన్నారో అలా ఉంటే చాలని అన్నాడు. ఈ జనరేషన్ కి మీరంటే ఏమిటో తెలియచెప్పాలనేది నా కోరిక అని చెప్పాడు. నాకు అలాంటి పాత్రలు కేక్ వాక్ కాబట్టి, ఒకే అన్నాను. నా గత సినిమాల్లోని పాత్రలన్నీ ఒక క్యాప్సుల్స్‌లా పొందుపరిచి, తన ఫోన్‌లో పెట్టుకున్నాడు. ఈ సినిమాలో సన్నివేశానికి తగినట్లు ఫలానా కామెడీ టైమింగ్ తో చేయమని చెప్పేవాడు. చాలా చక్కగా హోమ్‌వర్క్ చేసుకొని, నా బాడీకి నాకు ఏది కంఫర్టబులో ఆ విధంగా తను ఆ సీన్స్ ని రాసుకున్నాడు. నేను వాటిని చాలా సరదాగా, ఎంజాయ్ చేస్తూ చేశాను""అనిల్ రావిపూడితో చేయటం నాకు చక్కటి ఎక్స్పీరియన్స్. సినిమా షూటింగ్ అయిపోయిన ఆఖరి రోజున నేను చాలా ఎమోషన్ గా ఫీల్ అయ్యాను. ఏదైనా ఒక సినిమా అయిపోయిందంటే.. అబ్బా చాలురా అయిపోయింది, గుమ్మడిగా కొట్టేసారు, ఇంక మనం వేరే సినిమా షిఫ్ట్ అయిపోవచ్చు అనే మూడ్ లో ఉంటాం. కానీ ఈ సినిమా ఆఖరి రోజున, కాలేజీని వదిలేసేప్పుడు జరిగే ఫేర్ వెల్ పార్టీలా ఎమోషనల్ గా అనిపించింది. మళ్ళీ ఎప్పుడు కలుస్తారో, ఎలా కలుస్తారో తెలియనటువంటి అలాంటి ఎమోషన్ కి నేను లోనయ్యాను. అంతకుముందు నాకు ఎప్పుడు అలాంటిది అనుభవంలో రాలేదు. నాకు అలాంటి ఫీలింగ్ వచ్చింది. అనిల్ కి చెప్తే తనకీ అదే ఫీలింగ్ ఉందని అన్నాడు. ప్రతి రోజు ఒక పిక్నిక్ కి వెళ్ళినట్లుగా చాలా సరదా సరదాగా ఈ సినిమా చేశాం" అని చిరంజీవి తెలిపారు."వెంకటేష్ చుట్టూ పాజిటివ్ వైబ్స్ ఉంటాయి. నిజంగా అతనితో ఉంటే మనకి టైం తెలియదు. తన ఏజ్ కి మించినటువంటి విషయాలు తెలియజేస్తూ, జీవితం యొక్క పరమావధి ఏంటి? జీవితం ఎలా ఉండాలి? ఎంత పీస్ ఫుల్ గా ఉండాలి? అనేది చెప్తుంటే.. వెంకీ నాకు మోడ్రన్ డ్రెస్ వేసుకున్న గురువులాగా అనిపిస్తుంటాడు. సినిమా జీవితాన్ని, తన వ్యక్తిగత జీవితాన్ని రెండిటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ.. చాలా చక్కగా ముందుకు సాగుతున్న ఆయన ప్రయాణం ఎంతో ఇన్స్పైర్ గా ఉంటుంది. గతంలో ఓసారి లాస్ ఏంజిల్స్‌లో నేనూ వెంకటేష్ కలిసి ఫొటో దిగాం. అప్పటి నుంచి ఆయనతో సినిమా చేయాలని అనిపించేది. అది సినిమాతో నిజమైంది. థియేటర్‌లో మా కాంబో ఎంజాయ్ చేస్తారు. క్లైమాక్స్ మరో స్థాయికి వెళ్తుంది. మా ఇద్దరి కాంబినేషన్‌లో ఫుల్ లెంగ్త్ సినిమా చూడాలని అనిల్ రావిపూడి అన్నాడు. ఎవరో ఎందుకు.. అనిల్ మంచి కథ రెడీ చేస్తే, మేం కలిసి నటించడానికి రెడీ' అని చిరంజీవి చెప్పుకొచ్చారు.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jaganannа colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com